

పోలీసుస్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-చిన్నమండెం

స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రిసెప్షన్ కేంద్రంలో రికార్డుల నిర్వహణ, ప్రజా సమస్యలు పరిష్కారాలను తదితర అంశాలను పరిశీలించి మహిళల సమస్యలకు ప్రాధాన్యత, ఇష్యూ పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి, వాటి దర్యాప్తు, పురోగతిపై ఆరా తీశారు. రౌడీ షీటర్లు, చెడునడవడిక కలిగిన వ్యక్తులపై, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు రాత్రి గస్తీ మరింత పటిష్టంగా నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎన్‌బిడబ్ల్యులను త్వరగా అమలుపరచాలన్నారు. సమస్యాత్మక గ్రామాల పై దృష్టిసారించి గ్రామస్తులతో మమేకమై ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు, గ్రామ సందర్శన, దత్తత కానిస్టేబుల్, మహిళా పోలీసుల సమన్వయంతో కట్టడి చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎంవి చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి రూరల్ సిఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

త్వరలో హంద్రీ-నీవా పనులు పూర్తి చేస్తాం

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి-కురబలకోట(మదనపల్లె అర్బన్)

రాయలసీమను రతనాలసీమగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శుక్రవారం తంబళ్లపల్లి నియోజకవర్గం, కురబలకోట మండలం, దొమ్మనబావి వద్ద హంద్రీ-నీవా పనులను మంత్రి పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, నీటి పారుదల శాఖ అధికారులు, ఇంజనీర్లు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు, పలువురు టిడిపి నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం హంద్రీ-నీవా పనులను పరిశీలించి భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నీటిపారుదల శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో నిర్మాణం చేసి ప్రజలకు సాగునీరు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాలనా దక్షత కలిగిన ముఖ్యమంత్రి వీటన్నిటిని అధిగమించి హంద్రీ-నీవా కాలువను పూర్తిస్థాయిలో పారించి ప్రజలకు తాగునీరు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే, నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో కలిసి దొమ్మనబావి వద్ద ఉన్న హంద్రీ నీవా ప్రాజెక్టును పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి నిల్వ ప్రాంతాలు, ట్యాంకు కింద ఉన్న భూముల తదితర విషయాలను అధికారులతో చర్చించారు. హంద్రీ-నీవా ద్వారా 3,850 క్యూసెక్కుల నీటి సరఫరాకు ప్రణాళిక రచించి 90 శాతం పనులను ఆనాటి టిడిపి ప్రభుత్వం పూర్తి చేస్తే మిగిలిన 10 శాతం పనులను గత ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో కాలువల్లో చుక్క నీరు లేకుండా పోయిందని విమర్శించారు. సమ్మర్ స్టోరేజ్ వద్ద ఇసుకను దోపిడీ చేశారని ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా తవ్వేసి దోచుకున్నారని పేర్కొన్నారు. ఇసుకను పూర్తిగా తోడెయ్యడంతో వర్షాధారం ద్వారా వచ్చే నీళ్ళు నిల్వ లేకుండా అడుగంటి పోవడం, లీకేజ్ కావడం వంటివి జరుగుతూ ఉన్నాయన్నారు. భూగర్భ జలాల పెంపు సాగునీటి అవసరాల కోసం చెరువులను సంరక్షించాలని తెలిపారు. రానున్న వర్షాకాలం కంటే ముందు చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని, వీటన్నిటిని అరికట్టి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగునీరు, సాగు నీరు అందిస్తామన్నారు. ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నిర్మాణం చేసి ప్రజలకు సాగునీరు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాయలసీమకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి చివరి ఆయకట్టు వరకు నీరు అందించి ప్రతి ఎకరాకు సాగునీరు, తాగు నీరు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను విస్తృతంగా అమలు చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ఆదేశాల మేరకు మే మాసం థీమ్ ఉష్ణాన్ని నివారించే విధంగా శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించాల్సిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాల నిర్వహణ, తాగునీరు, ఉపాధి హామీ, పల్లె పండుగ పనుల ప్రగతిపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను చెత్త రహితంగా రూపొందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. మూడవ శనివారం జిల్లాలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు ఉష్ణాన్ని నివారించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయితీ, మండలాలు, మున్సిపాలిటీలలో ప్రముఖ కూడళ్ళు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతరత్రా అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన చలివేంద్రాలను పరిశీలించి ప్రజలకు నీరు అందుబాటులో ఉంచాలన్నారు. జన రద్దీ ఉన్న ప్రాంతాలలో ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్, మార్కెట్లు, బస్టాండు తదితర ప్రాంతాలలో ఎండ నుంచి రక్షణ నిచ్చే విధంగా షేడ్ నెట్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రాంతాలలో వైద్యారోగ్య శాఖ ద్వారా వృద్ధులకు వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. నీరు ప్రతి ప్రాణికి అవసరమని అందువల్ల శనివారం పశుపక్షాదులకు కూడా చిన్న చిన్న పాత్రలు, మూకుళ్ళలో నీరు ఏర్పాటు చేయాలని, పెద్ద పశువులకు నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలని చెప్పారు. గత మాసాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్రలో చేపట్టిన సింగిల్ యూస్ ప్లాస్టిక్, ఈ వేస్ట్ తగ్గించడం, సాలిడ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అంశాలలో కూడా కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వేడిని జయిద్దాం అనే నినాదంతో స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఉద్యోగుల సౌకర్యార్థం ప్రభుత్వం బదిలీలకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వులలోని మార్గదర్శకాలు మేరకు పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు రాకూడదన్నారు. ఇప్పటికే జిల్లాలో 141 గ్రామాలలో నీటి సరఫరా జరుగుతోందన్నారు. ఎక్కడైనా బోర్లు, మోటార్లు పనిచేయకుంటే వెంటనే మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. నీటి కొరత సమస్యను ముందుగానే గుర్తించి అవసరమైన ప్రతి చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, అందుకు సంబంధించిన బిల్లులన్నీ కూడా పారదర్శకంగా ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనులను కూడా పటిష్టంగా అమలు చేయాలన్నారు. లేబర్ మొబిలైజేషన్‌లో భాగంగా ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిని తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఇందులో లక్ష్యంలో వెనుకబడిన మండలాలు ప్రత్యేక దృష్టి పెట్టి లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలని సూచించారు. జిల్లాలో పదివేల ఎకరాలలో గడ్డి పెంపకం చేపట్టాల్సి ఉందని ఈ మాసం చివరి నాటికి 3వేల ఎకరాలలో గడ్డి పెంపకానికి భూములు గుర్తించి ప్రతిపాదనలు సమర్పించడం లక్ష్యన్నారు. ఇందుకుగాను ప్రతి మండలానికి 100 ఎకరాలు లక్ష్యంగా ఇవ్వడం జరిగిందని, 1550 ఎకరాలను గుర్తించారని, మిగిలిన లక్ష్యాన్ని కూడా ఈనెలాఖరులోపు పూర్తిచేయాలని సూచించారు. వ్యక్తిగత కంపోస్ట్ పిట్స్ ఏర్పాటు అంశంలో లక్ష్యం మేరకు ప్రతిపాదనలు తయారుచేసి రేపు సాయంత్రం లోగా జిల్లా కేంద్రానికి పంపాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు గ్రామాలలో 1300 నీటి తొట్టెల నిర్మాణానికి గాను 1120 నీటి తొట్టెలు పూర్తి చేశారని, వాట న్నిటిని రేపు ప్రారంభించాలన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఉపాధిలో ఉద్యానవన పెంపకం నిమిత్తం జిల్లాకు 5వేల ఎకరాల లక్ష్యంగా నిర్ణయించామన్నారు. 3620 ఎకరాలు గుర్తించారని, మిగిలిన వాటిని ఈనెలాఖరులోగా గుర్తించాలని సూచించారు. జూన్ నాటికి వర్షం పడిన వెంటనే ఫిట్టింగు, ప్లాంటేషన్కు అవకాశం ఉంటుందని తెలిపారు. 2024- 25 సంవత్సరానికి సంబంధించి పల్లె పండుగ కింద రెండు దశల్లో మంజూరు చేసిన 1360 సీసీ రోడ్డు పనులలో 94 శాతం పూర్తి చేశారని, ఇంకను 151 యొక్క పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని నిర్దేశిత కాలపరిమితిలోగా వెంటనే పూర్తి చేయాలన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రతి నియోజకవర్గంలో రూ 10 కోట్ల విలువైన రోడ్ల పనులకు మంజూరు అనుమతులు పొందేందుకు గ్రామ మండల సభ తీర్మానాలను వారంలోగా సమర్పించాలని చెప్పారు. పంచాయతీలలో చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ప్రతిరోజు చెత్త సేకరణతో పాటు ప్లాస్టిక్ సెగ్రిగేషన్ తప్పనిసరిగా చేయాలిన్నారు. తడి పొడి చెత్త లను వేరువేరుగా సేకరించాలి. ప్రతి పంచాయతీలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పక్కాగా నిర్వహించి రోడ్డుకిరువైపులా, గ్రామ సమీపంలో ఉన్న చెత్తను తొలగించాలని అధికారులకు సూచించారు. వైద్యారోగ్య శాఖ ద్వారా వయోవృద్ధులకు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. రక్తహీనత కలిగిన గర్భిణులు, మహిళలు, పిల్లలకు ఐరన్ మాత్రలు సరఫరా చేయాలని, అంగన్వాడీ కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలని ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి : ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజకీయ పార్టీలకు అతీతంగా రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశాన్ని చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి అధ్యక్షత నిర్వహించారు. రాజంపేట మున్సిపాలిటీ శానిటేషన్ నిర్వహణ కోసం ఎంపీ నిధుల నుండి రూ.20 లక్షలు వితరణ చేసిన రెండు ట్రాక్టర్లకు ఎంపీ, ఎమ్మెల్యే, చైర్మన్ కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెండా ఊపి ట్రాక్టర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అన్నివేళలా అందజేస్తానని తెలియజేశారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని అధికారులు సమన్వయ కృషితో స్వచ్ఛ రాజంపేటగా తీర్చిదిద్దాలని తెలిపారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రధానంగా రోడ్లపై చెత్త వెయ్యకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో పలువురు వైసిపి కౌన్సిలర్లు ఇంజినీరింగ్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి రికార్డులను నమోదు చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు కౌన్సిలర్లకు సరైన సమాధానం ఇవ్వడం లేదని కౌన్సిల్ సమావేశంలో తెలియజేశారు. దీనిపై వెంటనే చైర్మన్ శ్రీనివాసులురెడ్డి స్పందించి అధికారులు పనితీరు మార్చుకోవాలని సూచించారు. రానున్న సమావేశంలో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకూ డదని తెలియజేశారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి కౌన్సిల్ సమావేశంలో తెలిపారు. వీటిలో కొన్ని పనులకు సంబంధించి తప్పనిసరిగా టెండర్ వేయాలని కమిషనర్ శ్రీనివాసులును ఆదేశించారు. చైర్మన్ మాట్లాడుతూ అధికారులు తప్పనిసరిగా నిత్యం వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పేరుకుపోయిన బకాయిలను తక్షణమే వసూలు చేయాలన్నారు. ఎక్కడ కూడా పారిశుధ్యం సమస్యలు లేకుండా చేయాలన్నారు. **కౌన్సిల్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన టిడిపి కౌన్సిలర్లు..:** మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశానికి టిడిపి కౌన్సిలర్లు బాయ్ కట్ చేశారు. కౌన్సిల్ సమావేశానికి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి హాజరు కావడంతో సమావేశం మొదట్లోనే బాయ్‌కాట్ చేశారు. అనంతరం మిగిలిన సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. 32 అంశాలతో కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించి సిమెంట్ రోడ్లు, తాగునీటికి, మార్కెట్ బకాయిలపై, వీటితోపాటు మరికొన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ మర్రి రవికుమార్, షేక్ సుమియా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మేనేజర్ సూర్య కుమార్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. సమావేశం ముగిసేవరకూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రకృతి వ్యవసాయంతో అదుతే ఫలితాలు సాధించవచ్చునని వ్యవసాయ నిపుణులు పేర్కొన్నారు. శుక్రవారం మహిళా సమాఖ్య కార్యాలయంలో వ్యవసాయ సిబ్బంది, డిఆర్‌డిఎ సిబ్బంది, గ్రామ సంఘం లీడర్లు, సంఘమిత్రాలు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, అందరితో కలిసి ప్రకృతి వ్యవసాయంపైన మండలస్థాయి ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక తయారు, ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించడం గురించి సమావేశంలో ఎడిఎ శివ శంకర్, ఎంపిడిఒ తాజ్ మస్రూర్, ఎపిఒ సుబ్రహ్మణ్యం, ఎపిఎం చెన్నకేశవులు, ఎఒ నాగప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రవీణ్, ఖాదర్‌భీ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఈసెట్‌లో 'సాయి' విద్యార్థుల విజయ కేతనం

ప్రజాశక్తి-రాయచోటి

శ్రీ సాయి పాలిటెక్నిక్ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ఈ సెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ కనపరిచారని కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం నుండి సాయి కళ్యాణి 512 ర్యాంకు, స్వరూప లహరి 652 ర్యాంక్, సభా ఫిర్దోస్ 708 ర్యాంక్, మెకానికల్ విభాగం నుండి సి.మహేష్ 1903 ర్యాంక్, ఎలక్ట్రికల్ విభాగం నుండి నిసార అహ్మద్ 1276, సివిల్ ఇంజనీరింగ్ విభాగం నుండి ముషారఫ్ అలీ 1585 ర్యాంక్ సాధించారని తెలియజేశారు. పాలిటెక్నిక్ కోర్సులు ఎంచుకున్న విద్యార్థులకు మొదటి సంవత్సరం నుండి నిర్దిష్ట ప్రణాళికతో అకాడమిక్ అంశాలతో పాటు పోటీ పరీక్షలకు కూడా ప్రత్యేక శిక్షణ కల్పిస్తున్నామని తద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలను పొందగలుగుతున్నా రని అభిప్రాయపడ్డారు. కళాశాలలో కమ్యూనికేషన్స్ స్కిల్స్, అర్థమెటిక్, ప్రాజెక్టు ఇంటర్న్ షిప్ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నా మని వివరించారు. ఈ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలలో పాలీసెట్ ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేసుకోవచ్చని సూచించారు. ఈసెట్ ప్రవేశ పరీక్షలు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, పాలిటెక్నిక్ విభాగపు ఇన్‌ఛార్జి వి.ప్రతాప్ రావు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

మదనపల్లెలో ఘనంగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆపరేషన్ సింధూర్ విజయంతో దేశ ప్రజలు గర్విస్తున్నారని, ఉగ్రవాదులు, పాకిస్తాన్ దేశంపైన మన దేశసైనికుల వీరత్వానికి సంఘీభావంగా శుక్రవారం మదనపల్లె పట్టణంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా, టిడిపి, బిజెపి, జనసేన నాయకుల నేతృత్వంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రధాన తపాలా కేంద్రం, బెంగళూరు బస్టాండ్ మీదుగా చిత్తూరు బస్టాండ్ వరకు చేపట్టారు. ఈ సందర్భంగా షాజహాన్ బాషా మాట్లాడుతూ పెహల్గం ఉగ్రవాదుల దాడికి ప్రతి చర్యగా ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసి, ముఖ్యమైన ఉగ్రవాదులను అంత మొందించారన్నారు. భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ద్వారా అద్భుతమైన విజయంతో ప్రపంచానికి మన సైనిక శక్తిని చాటిచెప్పామన్నారు. ఉగ్రవాదులను అంతమొందించడంలో వీరమరణం పొందిన జవాన్లకు దేశ ప్రజలు సలాం చేస్తున్నారన్నారు. వారి త్యాగం దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా మిగిలి పోతుందన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, టిడిపి నాయకులు పచ్చిపాల రామకృష్ణ ఆచారి, ఆర్.జె.వెంకటేష్, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, హజ్ కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్ ఖాన్, ఎస్.ఎం రఫీ, షంషేర్, రఘుపతి నాయుడు, తమ్మిశెట్టి రామకృష్ణ, రెడ్డెప్ప, జీవి నాయుడు, బిజెపి నాయకులు బండి ఆనంద్, ఎల్లంపల్లి ప్రశాంత్, రూరల్ మండల అధ్యక్షుడు తరిగొండ వెంకటరమణారెడ్డి, జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు, ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న అతిథి బావాజీ

కృత్రిమ మేధతో నైపుణ్యాలకు కొత్త రూపు

- సీనియర్ టెక్నికల్ స్పెషలిస్ట్ బావాజీ

ప్రజాశక్తి-మదనపల్లె

కృత్రిమ మేధ(ఎఐ)తో కొత్త టెక్నాలజీలు పుట్టుకొస్తాయని, తద్వారా పని స్వభావంలో మార్పులు వస్తాయని బెంగళూరు ఎల్‌టిఐ మైండ్రీలో సీనియర్ టెక్నికల్ స్పెషలిస్ట్ బావాజీ అన్నారు. మిట్స్ కాలేజీలో శుక్రవారం కంప్యూటర్స్యాటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విభాగం, కంప్యూటింగ్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్‌పై రెండవ అంతర్జాతీయ సమావేశం ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రపంచ పరిశోధకులు, విద్యావేత్తలు, విద్యార్థులు కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్‌లో సహకరించడానికి, ఆవిష్కరణలను పంచుకోవడానికి ఈ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బెంగళూరు ఎల్‌టిఐ మైండ్రీలో సీనియర్ టెక్నికల్ స్పెషలిస్ట్ బావాజీ దొరగింటి మాట్లాడుతూ వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో ఎఐ యొక్క పరివర్తన పాత్రను వివరించారు. వైఫల్యాలను విజయానికి మెట్లుగా చూస్తూ, స్థిరమైన మనస్తత్వాన్ని అలవర్చుకోవాలని పాల్గొనేవారిని ప్రోత్సహించారు. నేటి వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ల్యాండ్‌స్కేప్‌లో పోటీతత్వంతో ఉండటానికి తాజా సాంకేతిక ధోరణులతో తాజాగా ఉండాలని కూడా విద్యార్థులను కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇకపై కేవలం భవిష్యత్ భావన కాదు-ఇది పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థలు, సమాజాలను పునర్నిర్మించే ఆవిష్కరణల తరంగం వెనుక ఉన్న చోదక శక్తన్నారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ పరిశోధన ప్రపంచ వ్యాప్తంగా వేగవంతం అవుతున్నందున, మనం జీవించే మరియు పనిచేసే విధానాన్ని నేర్చుకోవడం, స్వీకరించడం, మార్చగల సామర్థ్యం గల మేధో వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో సంస్థలు, పరిశోధకులు ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. ఎఐ పరిశోధన యంత్ర అభ్యాసం, సహజ భాషా ప్రాసెసింగ్, కంప్యూటర్ దృష్టి, రోబోటిక్స్, లోతైన అభ్యాసంతో సహా బహుళ డొమైన్‌లలో విస్తరించి ఉందని తెలిపారు. ఈ సాంకేతికతలు ఆరోగ్య సంరక్షణ విశ్లేషణలు, స్వయంప్రతిపత్త వాహనాలు, వాతావరణ నమూనా, వ్యక్తిగతీకరించిన విద్య, ఆర్థిక అంచనా, మరిన్నింటిలో పురోగతులను సాధ్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. డేటా ఆధారిత ఖచ్చితత్వంతో పరిశోధకులు ఉన్న సమస్యలను పరిష్కరించడమే కాకుండా, మానవ-యంత్ర సహకారం ద్వారా సాధ్యమయ్యే వాటిని పునర్నిర్వచిస్తున్నారని పేర్కొన్నారు. దేశ నలుమూలల నుంచి ఎంతో మంది పరిశోధనలు చేసారని తెలిపారు. వారి పరిశోధనలు ఇక్కడ ప్రదర్శించడం వారి ఐడియాలు పంచుకోవడం జరిగిందని కళాశాల వైస్ ప్రిన్సిపల్ రామనాథన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుమయా సనోబర్, ప్రొఫెసర్ గౌతమ్ చక్రవర్తి, విభాగాధిపతి డాక్టర్ చొక్కనాదన్, కన్వీనర్ డాక్టర్ కె.హేమలత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'డెంగీపై అవగాహన కలిగి ఉండాలి'

ప్రజాశక్తి-పీలేరు

మంచి ఆరోగ్యం కోసం ముందస్తు నివారణ చర్యలు చాలా అవసరమని, వ్యాధుల నిర్మూలనకు అవి చక్కగా దోహదపడతాయని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమాల ద్వారా పీలేరు పట్టణ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్, తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. మన నివాస ప్రాంతాల్లో డెంగీ వ్యాధులకు కారణమైన టైగర్ దోమ ఉత్పత్తికి దోహదపడే నీటి నిల్వలను వివారించి, శుభ్రం చేసి ఉంచుకోవాలని సూచించారు. తర్వాత నిర్వహించిన మానవహారంలో సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్ దోమ నియంత్రణకై నా వంతు కృషి చేస్తానని ఆశ కార్యకర్తల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, సిహెచ్ఒ జయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, యంపిహెచ్ఇఒ లు శ్రీనివాసులు చంద్రయ్య, పర్యవేక్షకులు చిన్నప్ప, కుసుమ, తలుపుల, రేగళ్ల పిహెచ్‌సిల పరిధిలోని ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** ప్రతి ఒక్కరూ డెంగీపై అవగాహన కలిగి ఉండాలని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి డాక్టర్ జులేఖ బేగం అన్నారు. చింతపర్తి పిహెచ్‌సి పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నీరు, మురుగు నిల్వ ఉండడం వలన దోమలు వృద్ధి చెంది రోగాల భారిన పడాల్సి వస్తోందన్నారు. పూలకుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పలు తదితర వాటిల్లో నీరు నిల్వ లేకుండా శుభ్రపరుచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిశ్రీ, సూపర్‌వైజర్ సుధాకర్, భానుభి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** అవగాహనతోనే డెంగీని నివారించవచ్చునని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ చిన్నికృష్ణ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరాజు తెలిపారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ దోమలు మంచి నీటిలో గుడ్లు పెడుతాయని, ఈ దోమలు ఇంటి లోపల, ఇంటి ఆవరణలో ఉంటాయన్నారు. ఈ దోమలు మనుషులను పగటి పూట మాత్రమే కుడతాయని తెలిపారు. డెంగీ వ్యాధి మూడు రకాలుగా ఉంటుందని, జ్వరం, హేమరేజ్ జ్వరం, డెంగ్యూ సాక్ సిండ్రోమ్ అని మూడు రకాలుగా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శేఖర్, వికాస్, లక్ష్మి ప్రసన్న, అశోక్, స్నేహ, మలేరియా సబ్ యూనిట్ అధికారి దాస్, టిబి సూపెర్వైసర్ జయ ప్రకాష్, ఎఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** దోమల నివారణతోనే డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చని ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ ప్రత్యూష అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో, ఎఎన్ఎం లతో కలసి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ దోమల నివారణతోనే డెంగీ వ్యాధిని అంతం చేయవచ్చన్నారు. మురుగునీటి గుంతలను శుభ్రపరచాలన్నారు. మీరు నిల్వ ఉన్న గుంతలను క్రమంగా శుభ్రపరిచి, లార్వా దశలోని దోమలను నివారించాలని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో దోమతెరలను వాడాలని సూచించారు. మూడు రోజులకు మించి నీరసంగా ఉన్న,, జ్వరము ఉన్న వెంటనే రక్త పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **నందలూరు :** పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని డెంగీ నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల వైద్యాధికారులు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్ పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిలో లార్వాను నిర్మూలించాలని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకటనారాయణ, పిహెచ్ఎన్ శైలజ, సూపెర్వైసర్ సునీల్, ఎఎన్ఎంలు, ఆశాలు, ప్రజలు పాల్గొన్నారు.



పీలేరు : ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రయివేట్ బస్సు కండక్టర్ హరినాథ్‌పై దాడి చేసిన మదనపల్లి మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషాపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, రామాంజులు అన్నారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గురువారం మదనపల్లిలోని బెంగళూరు బస్టాండ్‌లో నవాజ్ బాషాకు చెందిన బస్సులోకి ప్రయాణికులను రానివ్వకుండా తన బస్సులోకి ఎక్కువ మందిని ఎక్కించాడన్న అక్కసుతో కండక్టర్‌ను కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి ప్రజల్ని కొట్టడం, బెదిరించడం క్షమించరానిదని తెలిపారు. కండక్టర్ బస్సు పరిమితికి మించి ఎక్కువ మందిని ఎక్కిస్తే రవాణా అధికారులకి పిర్యాదు చేయాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని రౌడీయిజం చేస్తూ కండక్టర్‌పై దాడి చేయడం నేరమన్నారు. తన బస్సులే తిరగాలా? ఇంకెవరూ బస్సులు తిప్పకూడదా అని ప్రశ్నించారు. గతంలో అనేక సంఘటనలు ఉన్న కారణంగా ఆయన మీద అతని అనుచరులు మీద కేసు నమోదు చేసి అరెస్టుచేయాలన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే, కండక్టర్ మీద దాడి చేసిన మాజీ ఎమ్మెల్యేకి స్వయనా సోదరుడు కావడంతో చూసి చూడనట్లు ఉండ కుండా, చట్టం ముందు అందరూ సమానులేనని నమ్మి ఓట్లు వేసిన ప్రజల పక్షాన ఉండి చట్టపరమయిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పేదలకు అల్పాహారం అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పేదలకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలో సుపరిచితుడైన మాజీ క్రీడాకారుడు దివంగత భూమిరెడ్డి వెంకట కృష్ణయ్య వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వారి కుమారుడు లయన్ భూమి రెడ్డి మదన్ సౌజన్యంతో శుక్రవారం బస్టాండ్ కూడలిలో పేదలకు పెద్ద ఎత్తున అల్పాహార వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దివంగత కృష్ణయ్య కుటుంబీకులతో పాటు లయన్ డాక్టర్ బచ్చు జయభాస్కరరావు, కుర్రా మణి యాదవ్, ఎస్ఐ మన్నెం రామమోహన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నరసింహులు, శ్యామనబోయిన గురుప్రసాద్, మోడ పోతుల రాము, గంధం గంగాధర్, కొత్తపల్లి, సభ్యులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా 'మల్లారపు' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కలకడ

టిడిపి రాష్ట్ర రైతు విభాగ ఉపాధ్యక్షులు మల్లారపు రవిప్రకాష్ నాయుడు జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు భాస్కర ఆధ్వర్యంలో మాజీ ఎంపిటిసి చంద్రమోహన్ సమక్షంలో నిర్వహించినట్లు తెలిపారు. మండల కేంద్రమైన కలకడలో కేక్ కట్ చేసి రవిప్రకాష్‌కు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా రాజంపేట ప్రభుత్వ పాలి టెక్నిక్ కళాశాలలో ఈనెల 20న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉద్యోగమేళలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఇండిగో ఎయిర్ లైన్స్ ఆద్య హెచ్ఆర్ సొల్యూషన్స్, నియో లింక్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, బిగ్‌సి, ఫోన్ పే ఫ్లిప్ కార్ట్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఆసక్తి కలిగిన యువత ఈ ఉద్యోగామెళాను సద్వినియోగం చేసుకోవాలని చమర్తి కోరారు. https://naipunyam.ap.gov.in/user-registration లింకు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరములకు 9603770097, 95025 27277 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-నందలూరు



నందలూరు నూతన ఎస్‌గా మల్లికార్జునరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన కడప విఆర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే తనను నేరుగా సంప్రదించవచ్చునని తెలిపారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఐసిడిఎస్ కార్యాలయం పక్కన ఉన్నటువంటి రాజంపేట ప్రెస్ క్లబ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డిని రాజంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భాస్కర్ కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యే ప్రెస్ క్లబ్ నిర్మాణానికి అయ్యే ఖర్చును వివరాలతో కూడిన లిఖిత పూర్వక సమాచారాన్ని అందజేస్తే తప్పకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ఓబులేసు, శ్రీహరి, నాగేంద్రప్రసాద్, నరసింహులు పాల్గొన్నారు.

ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ లక్ష్మీప్రసాద్

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంఅన్నమయ్య జిల్లా నూతన అధ్యక్షులుగా డాక్టర్ లక్ష్మీప్రసాద్‌ను శుక్రవారం ఎన్నుకున్నారు. కడప జిల్లా అధ్యక్షులు రఘురామనాయుడు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు నూతన అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నన్ను జిల్లా ఎపిజిఇఎ నూతన అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రమేష్, కడప జిల్లా అధ్యక్షులు రఘురామ ః నాయుడు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ కృష్ణ ప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు ఆపన్న హస్తంగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో ముందు ఉంటానని తెలిపారు. ఉద్యోగులకు ఎల్లవేళలా చేదోడు వాదోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. జిల్లా నూతన అధ్యక్షులు ఎన్నిక కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో అరుదైన చికిత్స

- ఐదు కిలోల కణతి తొలగింపు

ప్రజాశక్తి చాపాడు(మైదుకూరు) : మైదుకూరులోని పిహెచ్‌సిలో వైద్య బృందం అరుదైన శస్త్రచికిత్సను చేశారు. శుక్రవారం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్ మాట్లాడుతూ 44 ఏళ్ల వయసుగల మహిళ కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారని చెప్పారు. వైద్య పరీక్షల అనంతరం ఆమె కడుపులో 5 కిలోలకు పైగా బరువున్న భారీ కణితి గర్భసంచిలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. తమ వైద్య బృందం అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో శస్త్రచికిత్స చేపట్టిందన్నారు. ప్రసూతి, స్త్రీ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ కె.శ్రీ లలిత నేతృత్వంలో, డాక్టర్ వీరనాథ్‌రెడ్డి, ఇతర వైద్య సిబ్బంది కణి తిని విజయవంతంగా తొలగించారన్నారు. ఈ శస్త్రచికిత్స అనంతరం రోగిని స్థిరంగా కాపాడగలిగినందుకు వైద్య బృందం సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రోగి పరిస్థితి నిలకడగా ఉందని, త్వరగా కోలుకుంటారని వైద్యులు చెప్పారు.

ఎమ్మెల్సీని కలిసిన డిసిసిబి చైర్మన్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని కడప సహకార బ్యాంకు చైర్మన్‌గా ఇటీవల నియమితులైన బి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీని సన్మానించారు. త్వరలో సహకార బ్యాంకు చైర్మన్‌గా ప్రభాస్ స్వీకారం చేయబోతున్నానని కార్యక్రమానికి తప్పకుండా రావాలని కోరారు. రాంగోపాల్ రెడ్డి డిసిసి చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

బాలికల ఉజ్వల భవితకు 'కిశోర వికాసం'



రామాపురం : బాలికల హక్కులపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

ప్రజాశక్తి-రామాపురం

బాలికల ఉజ్వల భవిత కిశోర వికాసం దోహదపడుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు హుస్సేనమ్మ, పద్మజ రాణి పేర్కొన్నారు. మండలంలోని రామాపురం సెక్టార్ పరిధిలోని నల్లగుట్టపల్లి పంచాయతీ కర్ణపు వాండ్లపల్లిలో గువ్వలచెరువు సెక్టార్ కసిరెడ్డి గారిపల్లి పంచాయతీ కొత్త రోడ్డు నారాయ ణపురం అంగన్వాడీ కేంద్రంలో వేసవి శిబి రంలో భాగంగా కిశోరి వికాసం నిర్వహించారు. కౌమారదశలో రక్తహీనత తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై 11 నుంచి 18 సంవత్సరాలోపు కిశోర బాలికలకు రక్తహీనత వల్ల జరుగు అనర్థాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కడుపులో నులి పురుగుల నివారణకు అబెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. వారానికి ఒకసారి ఐరన్ టాబ్లెట్స్ తీసుకోవాలన్నారు రోజువారి ఆహారంలో ఆకుకూరలు, పాలు, గుడ్డు పప్పు దినుసులు, చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కళ్యాణి, మహిళా పోలీసు, ఆరోగ్య సిబ్బంది, కిశోర బాలికలు బాలికలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండంలోని అనంతంపల్లి పంచాయతీ చాపల హరిజనవాడ అంగన్వాడీ కార్యకర్త సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కిశోర బాలికలకు బాలల హక్కులు, పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం 2006, బాల కార్మిక నిరోధక చట్టం, బాలల విద్యా హక్కు చట్టం, 14 సంవత్సరాల లోపు పిల్లలకు నిర్బంధ విద్యా హక్కు చట్టం, మహిళలపై బలత్కరణ, దాడి, చట్టాల గురించి వివరించారు. కిశోర బాలికలు తమ లక్ష్యాలను నిర్ధారిం చుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, మహిళా పోలీస్ మునిలక్ష్మి, కిషోర్ బాలికలు పాల్గొన్నారు. **పీలేరు:** కిశోర బాలికల వికాసాన్ని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భావించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అజంతా టాకీస్ అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కిశోర బాలికలు, తల్లులకు న్యూట్రిషన్, వ్యక్తిగత పరిశుభ్రత అవసరాలతో పాటు బాల్యవి వాహాల నివారణ, బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. మ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాల వయస్సు నిండాకే పెళ్లి చేయా లని తెలిపారు. జిఎం.ఎస్.కె షర్మిల మాట్లాడుతూ సైబర్ క్రైమ్, పిల్లల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. సోషల్ వర్కర్ డి.లావణ్య మాట్లాడుతూ పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్, 1098కి ఎలా ఫిర్యాదు చేయాలనేదానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కిశోర బాలికలు, అంగన్వాడీ కార్యకర్తలు కె.చిన్నమ్మ, జి.లక్ష్మీదేవి పాల్గొన్నారు.



పీలేరు : బాలికల సంరక్షణను వివరిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వరూప

ఆలయాల పునర్నిర్మాణ పనులు పరిశీలన



వీరభద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విశ్వనాథ్

ప్రజాశక్తి-నిమనపల్లి

మండలంలో జరుగుతున్న శ్రీ నేలమల్లేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ వీరభద్ర స్వామి ఆలయం పునర్నిర్మాణ పనులను జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తవళం గ్రామంలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ నేలమల్లేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను చేపట్టడానికి గతంలోనే రూ.3.18 కోట్ల నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. దేవాదాయ శాఖ నుంచి శ్రీ నేలమల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ, ఆలయ పునర్నిర్మాణానికి మొదట విడతలో కోటి రూపాయల నిధులను విడుదల చేయడం జరిగిందన్నారు. దీనితో ఆలయ గర్భగుడి పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయని పేర్కొన్నారు. రెండో విడత నిధులకై ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపామని, నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు. రాచ వేటి వారిపల్లె పంచాయతీ బొంతావారిపల్లెలో ప్రముఖ దేవస్థానం శ్రీ వీరభద్రస్వా మి ఆలయ పునర్నిర్మాణ పనులను రూ.90 లక్షలతో చేపట్టడం జరిగిం దని, పునర్నిర్మాణ పనులు దాదాపు పూర్తయినట్లు తెలిపారు. రాచవేటి వారి పల్లెలోని శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయ ధూప, దీప, నైవేద్య కైంకర్యాలను ప్రభుత్వం చేపట్టాలని గ్రామస్తులు విన్నవించగా ఆలయాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ధూప, దీప, నైవేద్య కైంకర్యాలు చేపట్టడానికి కొన్ని నియమాలు ఉన్నాయ న్నారు. అందులో ఆలయం 25 ఏళ్ల నాటిదై, ఆలయ ఆదాయం ఏడాదికి లక్ష రూపాయల లోపు ఉండాలన్నారు. దేవస్థానం భూమి డ్రై లాండ్ 10 ఎకరాలు, వెట్ ల్యాండ్ ఐదు ఎకరాల లోపు ఉండాలన్నారు. ఆలయానికి ధ్వజస్తంభం, గోపురం ఉండాలని, ఆలయంలో శిలా విగ్రహ ప్రతి ష్ట చేసి ఉండాలన్నారు. కేవలం గ్రామీణ ప్రాంతాలలోని ఆలయాలకు మాత్ర మే అర్హత ఉంటుందని పేర్కొన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా చరిత్ర కలిగిన ఆలయా లను, వాటి ప్రాముఖ్యతను కాపాడుతూ, పురాతన ఆలయాలను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు.


కార్యకర్తలే నా బలం..ప్రజాసేవే ధ్యేయం

- పవన్ వేసిన బాటలో పయనమే నా కర్తవ్యం
- యల్లటూరు శ్రీనివాసరాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



కార్యకర్తలే నా బలం.. ప్రజా సేవే తన ధ్యేయమని రాజంపేట పార్లమెంట్ జనసేన ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. శనివారం తన పుట్టినరోజు జరుపు కోనున్న సందర్భంగా ప్రజాశక్తితో ఆయన పలు విషయాలు పంచుకున్నారు. నందలూరు మండలం, పాటూరు పంచా యతీ, కుమ్మర పల్లికి చెందిన తాను డిఆర్‌డిఒలో అత్యున్నత రాష్ట్రస్థాయి (ఎపి టిడ్కో సిఇఒ)అధికారిగా పని చేశానని చెప్పారు. తనను నమ్ముకున్న ప్రజలకు మరెన్నో సేవలందించాలన్న సత్సంకల్పంతో ఉన్నత ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రత్యక్ష రాజకీయాలలోకి చ్చినట్లు తెలిపారు. పదవులు, అధికారం ఆకాంక్షించి తాను రాజకీయాలలోకి రాలేదని తెలిపారు. ప్రభుత్వ ఉన్నత అధికారిగా తాను విధు లు నిర్వహించిన శాఖలో పేదల కష్టాలు ప్రత్య క్షంగా చూశానని, ప్రజల ఆర్థిక స్వావ లంబన, సామాజిక న్యాయం సాధిం చాలంటే రాజకీయంగానే అది సాధ్యమవు తుందన్న నమ్మకంతో తనను అభిమానించే అనుచర గణం ప్రోద్బలంతో రాజకీయ అరంగేట్రం చేయడం జరిగిందని అన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న తన ఆలోచనలు జనసేనాని పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు సామీప్యత ఉందని, పార్టీ సిద్ధాంతాలు నచ్చి పవన్ కల్యాణ్ వెంట నడవడం జరిగిందని వివరించారు. తనకు కార్యకర్తలే బలమని, ప్రజలే దేవుళ్ళని ఉద్ఘాటించారు. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజాసేవకే తన జీవితం అంకితమన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య ఎటువంటి పొరపొచ్చాలు లేవని తెలిపారు. గత ప్రభుత్వ పాలకుల వల్ల నష్టపోయిన రాజంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే తన ముందు న్న లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చేరవేస్తూ సంక్షేమ ఫలాలు ప్రతి పౌరుడికి అందేలా కార్యాచరణ చేపడుతున్నట్లు వివరించారు. అహర్నిశలు ప్రజల కోసం పరితపించే ప్రజానాయకుడు జనసేనాని చూపిన మార్గంలో నడుస్తూ, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తూ జనసేన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండడమే తన ముందున్న లక్ష్యమని, ప్రజాసేవ చేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన సత్తా ఏంటో చూపిస్తామని తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికలలో రాజంపేట పార్లమెంటు ఎన్నికల సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్న తాను కూటమి కోటాలో జిల్లాలో దక్కించుకున్న ఏకైక జనసేన అసెం బ్లీ స్థానం రైల్వే కోడూరును అత్యధిక మెజారిటీతో గెలిపించు కోవడంలో శక్తివంచన లేకుండా కృషి చేశానని తెలిపారు. డిఆర్‌డిఎలో అధికారుల ఉద్యోగ సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగానూ, జాతీయ ఉపాధ్యక్షుడిగాను పదవుల లంకరించి అజాతశత్రువుగా పేరు గాంచిన తనకు ఎంపిటిసిగాను, జడ్‌పి టిసిగాను సేవలందించి 23 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన తన సోద రుడు యల్లటూరు శివరామరాజు అండ, ప్రేమా భిమానాలు కలిగిన తన అనుచర గణం, ప్రజల నిండు ఆశీస్సులు తనకు పుష్కలంగా ఉన్నాయని, భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.



సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరాజు(ఫైల్ ఫొటో)



విద్యార్థినికి సర్టిఫికెట్, మోమెంటో అందిస్తున్న కలెక్టర్ శ్రీధర్

వ్యాస రచనతో పిల్లల్లో సృజనాత్మకత : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

వ్యాసరచన వల్ల పిల్లలలో సృజనాత్మకత, సమాజం పట్ల అవగాహన పెంపొం దుతుందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్ జిల్లా విద్యాశాఖ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో విజేతలైన విద్యా ర్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లనుమోమెంటులను, పాఠ్యపుస్తకాలను అందిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రతినెల మూడవ శనివారం వివిధ కార్యక్ర మాలు నిర్వహి స్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సమాజం పట్ల అవగా హన పెంపొం దేందుకు వ్యాసరచన, చిత్రలేఖనం లలో పోటీలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. డిఇఒ సుబ్రహ్మణ్యం తెలిపారు. మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పోటీలను ఈనెల 15న నిర్వహిం చామని, మొత్తం 24 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వ్యాసరచనలో ఐదు గురికి, చిత్రలేఖనంలో ఐదుగురికి బహుమతులు అందించి నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ శివప్రకాశ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరు ఎక్సైజ్ స్టేషన్‌లో

టాస్క్ ఫోర్స్ సూపరింటెండెంట్ తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.మధు శుక్రవారం పీలేరు ఎక్సైజ్ స్టేషన్ అకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల సందర్భంగా ఆయన స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఎక్సైజ్ సంబంధిత కార్యకలాపాలపై సమగ్రంగా సమీక్ష చేశారు. ముఖ్యంగా క్రైమ్ స్టేటస్, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణలపై ప్రత్యేక దృష్టి సారించారు. అనంతరం ఎస్.మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నవోదయం 2.0 కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి, పీలేరు స్టేషన్ పరిధిలో తీసుకోవలసిన చర్యలపై సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. రాష్ట్రంలోని అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలను నియంత్రించడమే లక్ష్యంగా రూపొందించబడిన ప్రాధాన్యమైన ప్రణాళికని తెలియజేశారు. ప్రభుత్వ ఉద్దేశం, లక్ష్యం నెరవేర్చడానికి ఆ దిశగా క్షేత్ర స్థాయి అధికారులు గట్టి చర్యలు తీసుకోవడం అవసరమని ఆయన అన్నారు. స్టేషన్ సిబ్బందితో ముఖాముఖి చర్చ చేసి, వారి అభిప్రాయాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్ళను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పీలేరు ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న టాస్క్ ఫోర్స్ సూపరింటెండెంట్ మధు



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న రామచంద్ర, ఉపాధ్యాయులు

పాలిసెట్‌లో వైష్ణవి స్టడీ సెంటర్ విజయకేతనం

ప్రజాశక్తి-రాయచోటి

పాలిసెట్ ప్రవేశపరీక్షలో పట్టణంలోని వైష్ణవి స్టడీ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారని స్టడీ సెంటర్ డైరెక్టర్ రామచంద్ర తెలిపారు. ఎస్.జాఫర్ వలి 110/120, ఎస్.తౌఫిక్ అహ్మద్ 109/120, బి.గంగాధర్106/120,దీపక్ 105/120, మేఘన 104 /120, ఉమేష్ గుప్తా 103/120 మార్కులు సాధించారని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పశువైద్య కళాశాలలో

వెటర్నరీ కౌన్సిల్ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక పశువైద్యకళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పరిశీలకులు డాక్టర్ విజయకుమార్, డాక్టర్ సాహత్పురే ఈనెల 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు సాధరణ తనిఖీలు నిర్వహించారు. కళాశాలలోని వివిధ విభాగాలను, పశుచికిత్సాలయం, పశుగణక్షేత్ర సముదాయాలు, విద్యార్థుల వసతి గృహాలు, క్రీడావిభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి తమ సంతృప్తిని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా భోధన, భోధనేతర సిబ్బందితో, విద్యార్థిని, విద్యార్థులతో సమావేశమై వారి అభిప్రాయలను స్వీకరించారు. వారి వెంట శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ డాక్టర్ వి.చెంగల్వరాయలు, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ ప్రసాద్ సిబ్బంది ఉన్నారు.

శ్రీనివాస్‌రెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి - సింహాద్రిపురం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తూ ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొందిన శ్రీని వాస్ రెడ్డిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కృష్ణ మూర్తి మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ శ్రీనివాస్ రెడ్డి అందరి మన్ననలను పొందారన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ మండలంలోని ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి వెంకట రాముడు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



పొలాల్లో వదిలి వెళ్లిన హుండినినపరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-వీరబల్లి

రేణుక ఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. మండలంలోని మట్లి పంచాయతీలో పెద్దూరుకస్పాలో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..గ్రామ పరిధిలో ఉన్న ఎల్ల మ్మతల్లి ఆలయంలో అర్చకులు రోజువారిలాగే పూజలు నిర్వహించి అనంతరం ఆలయానికి తాళం వేసి వెళ్లారు. శుక్రవారం తెల్లవారి స్థానికులు కొందరు ఈ సంఘటనను గుర్తించి వెంటనే రూరల్ సిఐ వరప్రసాద్, స్థానిక ఎస్ఐ మోహన్‌నాయక్ సమాచారం అందించారు. వెంటనే సిఐ, ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీంచారు. ఈ సంఘటన విషయంపై ఆలయ పూజారిని, స్థానికులను విచారించగా గుర్తు తెలియని వ్యక్తులు ఈ చోరీకి పాల్పడినట్లు చెప్పారు. ఆలయంలో ఉన్న హుండి పక్కన పొలాల్లోకి తీసుకెళ్లి పగలగొట్టి అందులో ఉన్న నగదును దొంగించారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్‌టిసి బస్సు, ఆటో ఢీ

- ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఆర్‌టిసి బస్సు, ఆటో ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలైన సంఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. స్థానికులు, పోలీ సుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం ఎగువ కుంవంకలో నివాసముంటున్న షేక్.రెడ్డిబాషా శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి నిమ్మనపల్లెలోని సయ్యద్‌షావల్లి దర్గా వద్ద జరుగుతున్న ఉరుసు చూడడానికి నిమ్మనపల్లికు వచ్చారన్నారు. నిమ్మనపల్లి నుంచి స్వగ్రామం సింగంవారిపల్లెకు వెళ్లడానికి చిన్నళ్లవారిపల్లెకు చెందిన పఠాన్.ముస్తఫాకు చెందిన ఆటో వెళుతుండగా మార్గమధ్యలోని సైదాపేట మలుపు వద్ద మదనపల్లి-కందూరు సర్వీస్ ఆర్‌టిసి బస్సు కందూరు వైపు నుంచి వేగంగా వస్తూ ఆటోను ఢీకొట్టడం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కాగా ఒకే కుటుంబానికి చెందిన షేక్.రెడ్డిబాషా, షేక్.తాజున్‌బీ, షేక్.ఇమ్రాన్, షేక్.అసిఫాలతోపాటు ఆటో డ్రైవర్ పఠాన్.ముస్తఫా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను నిమ్మనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్సలు అందించారు. అనంతరం క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి దర్యాప్తు చర్యలు చేపట్టారు.

బైక్‌ను ఢీకొన్న కారు : వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-చిన్నమండెం



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో

మండల పరిధిలోని కేసాపురం ప్రధాన రహదారి పైన శుక్రవారం సాయంత్రం బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. .లక్కిరెడ్డిపల్లెకు చెందిన బోస్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో రాయ చోటికి వెళుతుండగా మదనపల్లి వైపు వెళుతున్న బైక్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో బోస్ తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. బాధితుడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

16 మంది పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-కలికిరి

పేకాట స్థావరంపై దాడి చేసి 16 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు కలికిరి సిఐ రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పతేగడ పంచాయతీ బెస్తపల్లి దగ్గర పేకాట 16మంది పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారంతో పోలీసు సిబ్బంది దాడి చేసి పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్దన ఉంచి రూ.1.50లక్షలు నగదు, తొమ్మిది మోటార్ సైకిల్లు, 15 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.